11. పెళ్లి ఆపి చూడు

రైలు దిగి, స్టేషను వదిలి, ఇవతలికొచ్చి రిక్షా ఎక్కేవరకూ వూరుకుని, రిక్షా బయలుదేరగానే నా చేతిలో ఓ కాగితం పెట్టింది సరస్వతి.

"నా ప్రకటనకు జవాబుగా మీ దరఖాస్తు అందినది. దరఖాస్తు అని మీరు పేర్కొన్నందుకు నేను చాలా నొచ్చుకున్నాను. అయితే ఆ మాట చూసి మీరు ఎంతో వినయ స్వభావం కలవారని అర్థం చేసుకొని నేను కొంత సంతోషించాను కూడా.

"మీరిచ్చిన వివరాలు నాకు ఆమోదంగా ఉన్నవి కనుక మనం ఒకర్నొకరు పలకరించుకోవడం మంచిదనే ఉద్దేశంతో; నేను మా అమ్మగారితో సహా ఈ నెల ఏడవతేదీ ఆదివారం ఉదయం సుమారు పదిగంటలకు మీ ఇంటికి రావాలని అనుకొంటున్నాను. మీరిచ్చిన అడ్రసు స్పష్టంగానే ఉంది....."

❖ ❖ ❖

"ఏడో తారీకూ - అంటే ఇవాళే!" అన్నాను.

"అందుకే కదా," అంది సరస్వతి. "అందుకే కదా, అంత హడావిడిగా నిన్న ఫోన్ చేసేను!" అని అర్థం.

నిన్న రాత్రి ఎనిమిది గంటలకి మా ఆఫీస్ హెడ్ గుమాస్తా మా ఇంటికి వచ్చేడు. "సుందర్రావూ, నువ్వు రేపు ఉదయం బెజవాడలో దిగిపోవాలోయి" అని, జేబులోంచి ఒక కాగితం తీసి నాకిచ్చేడు. మా ఆఫీసర్ గారు స్టెనోతో టైపు చేయించి పంపిన చీటీ అది.

"సాయంకాలం ఆరూ ఇరవై, బెజవాడనుంచి సుందర్రావు కోసం ఎస్.టి.డి.ఫోన్‌కాల్. సరస్వతి మాట్లాడేరు. సుందర్రావు ఇంటికి వెళ్లిపోయారని, ఈ రాత్రి పదిగంటలకి బయలుదేరే రైల్లో ఒంగోలు వెళ్తున్నారనీ చెప్పడమయింది. ఆమెకు సుందర్రావుతో అత్యవసరంగా మాట్లాడవలసిన పని ఉన్నదట. ఉదయం ఆ రైలు విజయవాడకు చేరేవేళకు స్టేషనుకి వెళ్లలేకపోయిన పక్షంలో సుందర్రావు విజయవాడలో రైలు దిగిపోయి, ఆమె ఉండే ఇంటికి వెళ్లి ఆమెను కలుసుకోవలసిందిగా సరస్వతి కోరుతున్నారు."

ఫోన్‌కాల్ రాగానే; ఆయన లేరండీ. ఎక్కడికెళ్లేరో తెలియదండీ. ఎప్పుడొస్తారో తెలియదండీ; అని చెప్పకుండా వీలున్నంతవరకు కమ్యూనికేషన్‌కి తోడ్పడాలి - అని మా ఆఫీసర్‌గారి సరణి.

❖ ❖ ❖

సరస్వతి మా పెత్తండ్రిగారి మనవరాలు. విజయవాడలో ఒక ప్రభుత్వ ఆఫీసులో

ఎకౌంటెంట్‌గా పనిచేస్తోంది. మొన్న మొన్నటి వరకూ ఒక హాస్టల్లో వుంది. ఈమధ్యనే ఒక ఇంట్లో ఒక వాటా అద్దెకి తీసుకుని అందులోకి చేరింది.

బి.కామ్ పాసై కాస్ట్ ఎకౌంట్స్ చేసి కొన్నాళ్లు ఓ చిన్న ఉద్యోగం చేసేక - అంటే ఇరవై నాలుగో ఏట సరస్వతికి పెళ్లయింది. మూడేళ్లు కాపరం చేసేక దాని మొగుడు రంగనాథరావు పోయేడు. అప్పటికతనికి ముప్ఫయి ఏడేళ్ళు.

"జాలిగొలిపే పరిస్థితులు" ఆధారంగా సరస్వతికి అదే ఆఫీసులో ఉద్యోగం ఇచ్చేరు. ఐతే, సరస్వతికి మంచి అర్హతలు ఉన్నందువల్ల ఎకౌంటెంట్ అయింది. రంగనాథరావు చనిపోయిన నాటికి అతను పదిహేనేళ్లు సర్వీసు చేసి వున్నాడు. అందువల్ల కొంచెం పెన్షను, ఈ జీతం వస్తున్నాయి. సరస్వతి ఆ అత్తగార్ని వచ్చి తనతో ఉండమంది గాని; ఆవిడ కూతురింట్లోనే ఉంటానంది. సరస్వతి ఆవిడకి ప్రతినెలా నాలుగువందల రూపాయలు పంపుతోంది. "అలా సెంటిమెంట్లు పెట్టేసుకోకు. పిల్లా జెల్లా లేరు కదా. చిన్నదానివే కదా. ఇంకో పెళ్లిచేసుకో" అని ఈ రెండేళ్లుగా అందరం సరస్వతికి చెప్తున్నాం. "నన్ను చేసుకునే వాడొకడు దొరకాలి కదా" అని సరస్వతి జవాబు.

ఇప్పుడు దొరికినట్టున్నాడు.

❖ ❖ ❖

ఇంటికి చేరిన ఐదు నిమిషాల్లో కాలకృత్యాలు తీర్చుకుని ముందుగదిలోకి వచ్చాను. "ఆ ఎడ్వర్‌టయిజ్‌మెంటు నాకోసారి చూపించు...." అన్నాను.

"ఓ," అని సరస్వతి ఒక కవరు నాకిచ్చింది. అందులో ఆ ప్రకటన, దానికి జవాబుగా తను రాసి పంపిన "దరఖాస్తు" కాపీ - ఉన్నాయి.

"విజయవాడలో ఒక ప్రయివేటు సంస్థలో మంచి ఉద్యోగం (రు.4,500)లో ఉన్న 35 ఏళ్ల యువకునికి 27 ఏళ్లు దాటిన వయసుగల వధువు కావలెను. వరునికి ఒక వివాహం అయినది కాని చట్టబద్ధమైన విడాకులు పొంది వున్నాడు. వధువు అవివాహిత అయి వుండాలనే నిబంధన లేదు. పిల్లలులేని భర్తృహీనుల నుండి కూడా జవాబులు కోరబడుచున్నవి. ఉద్యోగినులకు ప్రాధాన్యం." ఆ తరువాత కులం, గోత్రం వివరాలున్నాయి. బాక్సు నెంబరు ఉంది.

"అతనికీ ఈ ఊళ్లోనే ఉద్యోగం అన్నమాట!" అన్నాను.

"అందుకే కదా", అంది సరస్వతి.

"35 ఏళ్లంటున్నాడు. అంటే రంగనాథరావు కంటే కూడా చిన్నవాడన్నమాట" అన్నాను.

"అందుకే కదా", అంది సరస్వతి మళ్లీ.

"అన్నయ్యకి చెప్పేవా?"

"నిన్ననంతా అన్నయ్య కోసం ఫోన్‌లో ట్రయి చేసేను. దొరకలేదు. అయినా నాగపూర్ నుంచి రావాలి కదా. నీ అంత వేగంగా రాలేడు. ఈ ఉత్తరమైనా నాకు నిన్ననే ఒచ్చింది."

❖ ❖ ❖

పదింపావుకి వచ్చేరు; ఆ అబ్బాయీ, తల్లీ.

అతను చాలా చక్కగా ఉన్నాడు. ఆరడుగులకి కొద్దిగా తక్కువే గాని పొడగరి కిందనే లెక్క. తెల్లగా ఉన్నాడు. 35 ఏళ్ళున్నాడు గాని 30లా వున్నాడు. బొజ్జ లేదు; బట్టతల కాలేదు. సినిమాలో కాదు గాని ఏదో నవలలోనో, నాటకంలోనో చూసిన పాత్రలా ఉన్నాడు.

ఆవిడకి అరవై ఏళ్లుండొచ్చు. విధవరాలే గాని మొహానికి నల్లబొట్టు, చేతులకి బంగారు మురుగులూ ఉన్నాయి. ఇటుక రంగు పట్టంచు తెల్లచీర, అంచులేని తెల్ల రవిక. మొహంలో కొద్దిగా వేదన, కొద్దిగా విసుగు.

"రండి, రండి!" అని సరస్వతి ఆవిడని రెండు చేతులూ పట్టుకుని లోపలికి తీసుకొచ్చింది. "ప్లీజ్ సిడౌన్" అని అతనికి కుర్చీ చూపించి ఆవిణ్ణి సోఫా మీద కూర్చోబెట్టింది. "సరస్వతి నేనే. ఈయన మా చిన్నాన్నగారు. విశాఖపట్నంలో వుంటారు. ఇవాళే వొచ్చేరు. నేను టెలిఫోన్ చేసి రమ్మంటేను" అంది.

వాళ్ళిద్దరూ నమస్కారాలు చేసి కూర్చున్నారు. "ఇల్లు కనుక్కోడానికి ఇబ్బందేమీ పడలేదు కదా, మీరూ బెజవాడలోనే ఉంటున్నార్ట కదా. మీ ఇల్లు ఎటువేపు, బస్సులో వచ్చేరా ఆటోలో వచ్చేరా-" లాంటి ప్రశ్నలు వేస్తున్నాను.

"చిన్నాన్నా; నువ్వు మాట్లాడుతూ వుండు, నేనిప్పుడే వస్తాను" అని సరస్వతి లోపలికెళ్లింది. "ఎక్స్‌క్యూజ్ మి" అని ఆ అబ్బాయికి చెప్పి నేను కూడా లోపలికి వెళ్లేను.

"ఫరవాలేదు, చిన్నాన్నా; నే తెస్తాను! నువ్వు కూడా గెస్టువే కదా" అంది సరస్వతి అక్కడున్న సరంజామా చూపించి; నవ్వుతూ.

మూడు సాసర్లలో బిస్కెట్లు నాలుగేసి పేర్చి వున్నాయి. మూడు గ్లాసుల్లో మంచినీళ్లు పోసి వున్నాయి. మొత్తం అన్నీ ఒక ట్రేలో సర్దింది సరస్వతి. "సరే, పోనీ - నువ్విది పట్టుకెళ్లు; నేను కాఫీ కలిపి పట్టుకొస్తాను" అంది.

సరస్వతి హుందాగా, ఉత్సాహంగా వుంది. వంకపెట్టడానికి వీల్లేని చక్కదనం. ఈ ఇల్లు తనది. స్వతంత్రంగా బతుకుతోంది. పెళ్లిచూపులకి హాజరవడం ఇది మొదటిసారి కానే కాదు కదా. ఒకసారి పెళ్లయింది; మూడేళ్లు కాపరం చేసింది; ఒక ఆఫీసులో బాధ్యతగల ఉద్యోగం చేస్తోంది.

ఆకుపచ్చటి పువ్వులు మాత్రం ప్రింటుచేసున్న తెల్లటి ఫుల్‌వాయిల్ చీర కట్టింది

సరస్వతి. ఓ చేతికి గడియారం; రెండోచేతికి కంకణం లాంటి బంగారు మురుగు, మొహం మీద ఎర్రటి స్టిక్కర్‌బొట్టు.

"కాఫీ నేనే కలిపి తెస్తాను. ఈ ట్రే నువ్వు పట్టుకెళ్లు" అన్నాను.

"అలాగే; కాని - బావుండదేమో చిన్నాన్నా."

"ఏమిటి, నాకు కాఫీ కలపడమే చాతకాదంటావా?" అన్నాను.

సరస్వతి నవ్వింది "అదికాదు చిన్నాన్నా. నిన్నిక్కడ వంటింట్లో వొదిలేసి నేను వాళ్లతో కబుర్లు చెప్తూ కూచోడం బావుండదేమో- అంటున్నాను" అంది నెమ్మదిగా.

"ఐదు నిమిషాల్లో ఒచ్చేస్తానుగా; నువ్వు పద!"

అంత అందగాడూ స్ఫురద్రూపీ అయినా సరే, ఎందుకో ఆ అబ్బాయితో ఏదైనా మాట్లాడాలని అనిపించడం లేదు నాకు. ఆ అబ్బాయిని ఎక్కడ చూసేనా అనే; ఈ రెండుమూడు నిమిషాలనుంచీ నా ఆలోచన.

ఫిల్టర్‌లో డికాక్షన్ గిన్నెలోకి కొద్దిగా వొంచి, తగినన్ని పాలు కలిపాను. రంగు సరిపోయిందని నిర్ధారణ చేసుకొని గిన్నెని పొయ్యి మీదికి ఎక్కించేను. లైటరు టప్పుమనిపించగానే నా మెదడులో ఏదో వెలిగినట్టయింది.

"పాపా!" అని పిలిచేను.

"ఒచ్చే, వొచ్చే!" అంటూ; మరుక్షణంలో వచ్చింది సరస్వతి. 'అయ్యో, అయ్యో! అంత సెగెందుకు చిన్నాన్నా, కాఫీగిన్నె కింద? అందుకే కదా; నేను కలిపి తెస్తానన్నాను!' అంటూ మంట తగ్గించే ప్రయత్నంలో పడ్డాది.

మంట పొయ్యిలోది తగ్గింది - కాని -

"అతని పేరేమిటన్నావు?" అన్నాను.

"కె.రాజేశ్వరరావు-ట. నాకు రాసిన జవాబులో ఉంది; నువ్వు చూళ్లేదూ?" అంది సరస్వతి నెమ్మదిగా.

"అదే, అదే. సమయానికి గుర్తు రాక అడిగేను. పద.... కప్పులు ఇవేనా? ఇంకొక ట్రేవుందా? లేకపోతే ఈ స్టీలు పళ్లెంలో పేర్చి తెస్తాన్లే."

"ఇంకొంచెం వేడెక్కేక -" అని సరస్వతి వెళ్లింది.

అదీ రైటే. ఇంకొంచెం వేడెక్కాలి.

❖ ❖ ❖

నేను వెళ్లేసరికి రాజేశ్వర్రావు మాట్లాడుతున్నాడు. "అఫ్‌కోర్స్! మీకు ట్రాన్స్‌ఫర్లు ఉంటాయి. కాని, నాకు క్యాంపులు ఉంటాయి కదా. పైగా క్యాంపుల మధ్య లీజర్స్ కూడా వుంటాయి. ఎలాగో ఓలాగ ఎడ్జస్ట్ అవొచ్చు. అమ్మ వీలుని బట్టి ఇక్కడో అక్కడో ఉంటుంది.

అఫ్‌కోర్స్; మీరెక్కడుంటే అక్కడే అమ్మ కూడా వుంటే మీకు తోడుగా వుండి అన్నీ చూస్తుంటుందనుకోండి. నాకేముంది. మొగాణ్ణి; ఎక్కడైనా ఎడ్జస్ట్ అయిపోతాను!"

బెజవాడలో వాళ్లుంటున్నది స్వంత ఇల్లా, అద్దె ఇల్లా? అద్దె ఎంత? అసలు స్వగ్రామం ఏవూరు? పొలాలూ స్థలాలూ వున్నాయా? ఇద్దరి జీతాలూ కలిపితే రాబడి ఎంత అవుతుంది? అన్నదమ్ములున్నారా? ఎక్కడెక్కడున్నారు? మంచీ చెడ్డా చూడ్డం విధాయకం అయ్యే అక్క చెల్లెళ్లు గాని లేరు కదా? ఇలాటి ప్రశ్నలయ్యాయి.

"నేను పెళ్లి చేసుకుంటే అది రికార్డుల్లోకి ఎక్కుతుంది. ఆ తేదీనుంచి నాకు నా మొదటి భర్త మూలంగా వచ్చే పెన్షన్ ఆగిపోతుంది. ఎంతో ఏమీ? అయిదువందల ఇరవై. అయినాసరే, ఆయన పోవడం వల్ల నాకీ ఉద్యోగం వచ్చింది కనకానూ, ఆ అత్తగారికి నేను మాటిచ్చేను గనకానూ ఆవిడ బతికున్నంతకాలం ఆవిడకి నెలనెలా నాలుగువందల రూపాయలు పంపాలి. లేదా అంటే అలా ఆవిడకి నెలానెలా నాలుగు వందలు వడ్డీ వచ్చేటంత డబ్బు ఏదైనా బ్యాంక్‌లో డిపాజిట్ చెయ్యాలి" అంది సరస్వతి.

"అంటే ఎంత?" అన్నాడతను.

సరస్వతి రెండు క్షణాలు సీలింగ్‌ఫాన్ వేపు చూసి లెక్కకట్టింది - "ఓ యాభైవేలు చాలనుకుంటాను!"

"యాభై వేలు ఆవిడపేర డిపాజిట్ చేసేస్తే మరి నీ కొత్త కాపరానికి ఏం మిగుల్తుంది, పాపా?" అన్నాను.

"అదేంటి చిన్నాన్నా, అలాగంటావు? కొత్త కాపురానికి ఏంటుండాలేం, మహా?"

"అలా అనీకు. కొత్త కాపరం అన్నాక ఎన్నెన్నో వుండాలి. రుచులన్నీ చంపుకొని నువ్వు సోఫా కంబెడ్డు మీద నిద్రపోతున్నావు. ఓ ఫ్రిజ్జి లేదు, ఓ టీ.వీ. లేదు; బట్టలుతికే మిషనైనా లేదు నీకు! - ఇద్దరూ ఉద్యోగాలు చేసుకుంటున్నారన్నమాటే గాని ఇంట్లో ఏమీలేవే- అని కొలీగ్స్, అతని ఫ్రెండ్సో ఎత్తిపొడవ్వొచ్చు కదా.. ... పోయినవాడు పోనేపోయాడు. అతనే పోయాక ఇంకా ఆ అత్తగారేమిటి; ఆవిడకి నువ్వు ప్రతినెలా డబ్బు ఇంతా అని పద్ధతిగా ఏర్పాటు చెయ్యడమేంటి! సాక్షాత్తూ తల్లిదండ్రుల్నే-ఛీ, పీళ్లెక్కడ దాపరించేరని విసిరి కొడ్తున్న కాలం అయితేను!" అని దురుసుగానే అన్నాను.

"తప్పుమాట, బాబూ!" అంది, ఆవిడ. "అమ్మాయి మంచి మనసుని విరిచేకండి బాబూ, అవతలావిడికి కొడుకే లేడు; ఈ సాయం కూడా లేకపోతే యామైపోతుంది పాపం! ఆవిడ వుండేది - పోనీ ఇంకో కొడుకు దగ్గిరైతే అది వేరేమాట; కాని ఆవిడుండేది అల్లుడింట్లోనటగా?"

"మీ మొదటి భార్య - పద్మలత అన్నారు కదూ ఆవిడ పేరు?" - అని ఒక్క క్షణం ఆగాను నేను. "క్షమించండి; గతం తవ్వాలని కాదు, ఊరికే - సంబంధం కలుపుకొనే

ఉద్దేశం వచ్చింది గనుక అడుగుతున్నాను - ఆవిడకీ మీకూ ఏకారణం వల్ల విడాకులయ్యేయి?"

రాజేశ్వర్రావు నావేపు ఆశ్చర్యంగా అనుమానంగా చూసేడు; "పద్మలత మీకు తెలుసా?"

పెద్దావిడ నెత్తి కొట్టుకుంది. "ఏంటో బాబూ, బంగారం బంగారం అనుకుంటాం గానీ, వొక్కొక్కప్పుడు బంగారానిక్కూడా కిలుం పట్టొచ్చనిపిస్తుంది."

"అదో పెద్ద పొగరుబోతు పోట్లగిత్త!" అన్నాడు రాజేశ్వర్రావు; మొహం వీధివేపు తిప్పి. "సరస్వతిగారు మాత్రం సంపాదించుకోటం లేదా? అయినా ఇంత కల్చర్డ్‌గా, ఇంత సింపతెటిక్‌గా ఆలోచిస్తున్నారు. ఆ భర్త చనిపోయినా సరే ఆ అత్తగారి మీద సానుభూతితో ఆవిడకి హెల్ప్ చెయ్యాలన్న సంకల్పంతో వున్నారు. పద్మలత అలాక్కాదే! తను సంపాదించేదంతా తనదే అని -" అని మళ్లీ ఆగాడు. "సర్లెండి. మనం ఒకరికొకరు పరిచయం అయ్యాం కదా; మిగిలిన విషయాలన్నీ క్రమంగా సెటిల్ చేసుకోవచ్చనుకుంటాను" అన్నాడు సరస్వతితో. 'లే, అమ్మా; వెళ్లొద్దాం!" అన్నాడు తల్లితో "వస్తాం, సార్, నమస్కారం!" అన్నాడు నాతో.

ముందుగా లేచి నిలబడింది అతనే అయినా ముందుగా గుమ్మందాటింది పెద్దావిడే. నేను ఆవిడ కూడా మెట్లు దిగుతున్నప్పుడు ఆవిడ గొణుక్కుంటోంది. "తొందరొద్దు నాయనా అంటే వినిపించుకున్నాడుగాదు. కిలుంపట్టినా బంగారం బంగారమేరా అంటే కూడా లేచ్చక్కావొచ్చాడు!"

❖ ❖ ❖

వాళ్లు సందు మలుపు తిరిగే వరకూ గేటు దగ్గిర నిలబడి, అప్పుడు లోపలికొచ్చింది సరస్వతి. రావడం రావడమే సోఫా మీద వాలిపోయింది. వాలడం వాలడమే బోర్లాపడిపోయింది. సరస్వతికి ఏదో ఆశాభంగం కలిగిందని గ్రహించడానికి నాకొక నిమిషం పట్టింది. అప్పుడు కుర్చీలోంచి ఒక దిండుతీసి దాన్ని సరస్వతి తలకింద అమర్చడానికి ప్రయత్నం చేసేను.

"చాల్లే, నిరవాకం!" అని లేచి కూర్చుంది, సరస్వతి.

కొంచెం సేపు సరస్వతిని అలా బాధపడనిచ్చేను.

"ఏంటైందో, ఏం మాట్లాడుకున్నామో, అంతా అయోమయంగా వుంది"....... అంది సరస్వతి.

"కుర్రాడు బావున్నాడు. ఉద్యోగం కూడా గవర్నమెంట్ జాబ్ కాకపోయినా, మంచిదేలా వుంది. ఐనా, ప్రయివేట్ కంపెనీ ఉద్యోగాలు కూడా అంత చచ్చిపోయిలేవు ఈ రోజుల్లో-" అన్నాను.

"అందుకే కదా", అంది సరస్వతి, తన మామూలు ధోరణిలో. క్షణంలో మొహం మాడ్చుకుంది. "మరి - నువ్వింతాక ఎందుకలా పుల్లవిరుపు మాట్లన్నావు? - అదికాదు, చిన్నాన్నా; ఆవిడ పేరు పద్మలత - అని అతను చెప్పేడన్నావు; చెప్పలేదే!"

"చెప్పలేదు" అన్నాను.

"ఆవిడ సంగతి వాళ్ల దగ్గిర ఎందుకు ప్రస్తావించేవని!"

"పెళ్ళి చేసి చూడు - అనే కాదు; పెళ్లి ఆపి చూడు - అని కూడా ఆలోచించాలి; అవసరమైతే, అందుకు; ఆవిడపేరు అతను చెప్పకపోయినా నేనే గుర్తుకి తెచ్చేను. అతనెలా చిరాకుపడ్డాడో చూసేవు కదా!"

"అంటే!?"

"-జరిగిందేదో జరిగింది! గుర్తుచేస్తున్నానని ఏమీ అనుకోకు..... రంగనాథరావుతో నీ పెళ్లి మాటలు అవుతున్నప్పుడు కూడా అతనికి చిన్న వయస్సులోనే హైబీపీ అనీ, షుగరుందనీ, ఖర్చుదారీ మనిషనీ చెప్పి నేను నీ పెళ్ళి ఆపడానికి ప్రయత్నించేను.... ఎవ్వరూ నా మాటలు పట్టించుకోలేదు... .... ఇప్పుడు పద్మలత సంగతి చెప్తాను, విను! విన్నాక నీకెలా తోస్తే అలాగే చెయ్యి. ఆఫ్టరాల్, ఇది నీ జీవితం, నీ యిష్టం! నువ్వు మంచిదానివి. ఎంత మంచిదానివంటేనూ, నీ నెత్తిమీద ఎవరైనా చెయ్యేసి నిన్ను అణిచేస్తున్నా సరే పట్టించుకోనంత మంచిదానివి - మంచిగా ఉండడం మంచిదే కాని, తెలివిగా ఉండడం కూడా అవసరమే కదా!"

సరస్వతి ఏమీ అనలేదు.

"పద్మలత అనే అమ్మాయి నాకు తెలుసు. నీలాగే బాగా చదువుకుంది. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా రైల్వేలో సీనియర్ అసిస్టెంటుగా ఉద్యోగం సంపాదించుకుంది. సికింద్రాబాద్ రైల్ నిలయంలో పనిచేస్తోంది. ఇతను - అంటే ఈ రాజేశ్వర్రావు - హైదరాబాద్‌లో ఒక మంచి ప్రయివేట్ కంపెనీలో ఇంతకంటే కూడా మంచి పోస్టులో ఉండేవాడు. సరే, పెళ్లి కుదిరింది. పెళ్లి కుదిరితే పిచ్చి కుదుర్తుందనీ, పిచ్చి కుదిర్తే పెళ్లి కుదుర్తుందనీ కదా వాడుక! ఇతనికి పెళ్లి కుదిరాక పిచ్చి ముదిరిందే గాని కుదిరింది గాదు. యాభైవేలు కట్నం పుచ్చుకున్నాడు. రెండేళ్లలో అంతా తాగేశాడు. టూర్లు తిరిగే ఉద్యోగం కదా. ఊరూరా మొగా ఆడా తేడా లేకుండా ఫ్రెండ్సు ఏర్పడ్డారు. పాపం, ఆ అమ్మాయి; ఇల్లు నడిపిస్తూనే పదీ పాతికా మిగిల్చి ఇంటిక్కావల్సినవన్నీ కొన్నాది. ఫ్రిజ్జు, టీవీ, వాషింగ్ మెషీను; మిక్సీ, గ్రైండరు, కూలరు, డయినింగ్ టేబిల్, మంచాలూ, సోఫాలూ, బీరువా - ఒకటేమిటి; సమస్తం. ఇతగాడు జంటనగరాల్లో తిరగడానికి స్కూటర్ కావాలంటే తనే లోన్‌పెట్టి కొనిచ్చింది. ఆఖరికి ఒక ఎపార్ట్‌మెంట్ కొనేటప్పుడు పేచీ ఒచ్చింది. మీ నాన్నగార్నడిగి డబ్బుతే - అని పద్మలతని తరిమాడు. ఆయన చేతులెత్తేశాడు. ఇతగాడు

దెబ్బలాట పెట్టేశాడు. తిట్టేడు, కొట్టేడు కూడానూ, నిన్ను వదిలేస్తానన్నాడు. బంధువులూ, స్నేహితులూ ఎంతగానో నచ్చజెప్పేరు. ఐనా మొండితనానికి పోయేడు. ఒక యాడాదిపాటు వేరే రూమ్ తీసుకుని వున్నాడు. విడాకులికి కేసువేసి గెల్చుకున్నాడు. ఆ డిక్రీ చేత్తో పుచ్చుకుని నా సామాగ్రి నాకిచ్చెయ్యి; వెళ్లిపోతానన్నాడు. నీ సామాను ఇక్కడేం లేదు; పొమ్మంది పద్మలత. కోర్టు ఆర్డరు పొంది ఆఫీసర్ని తీసుకొచ్చేడు. తను కొన్న ప్రతీ వస్తువూ తన పేర్న బిల్లులు తీసుకునే కొన్న సంగతి పద్మలత రుజువు చేసుకుంది. మనకి పెళ్లయినపుడు నీ ఫ్రెండ్సు ప్రెజెంటేషన్‌గా యిచ్చిన సూట్‌కేసు ఇదుగో. నీ బట్టలూ, సర్టిఫికేట్లూ పెన్నూ, పెన్సిలూ, లెటర్‌హెడ్సూ తప్ప ఈ ఇంట్లో నీదంటూ ఏమీ లేదు. పో అవతలికి - అని తన్నకుండా తన్నితగిలేసింది పద్మలత ఈ ప్రబుద్ధుణ్ణి. అదుగో అప్పుడు చూసేనితన్ని; ఆ పక్కఫ్లాట్‌లో ఉన్న మీ నారాయణమూర్తి మామని పలకరించడానికెళ్లి! ఇప్పుడు ఇతగాడు మళ్ళీ కొత్త జీవితం ప్రారంభించాలని పేపర్లో ప్రకటనవేసి ఉద్యోగస్తురాళ్లకి ప్రాధాన్యం అంటున్నాడు. వెళ్ళు; నీకు ప్రాధాన్యం ఉంది. ఇతన్ని పెళ్ళి చేసుకుంటే కొన్నాళ్లకి నువ్వు మరో పద్మలతవి అవుతావు!" అన్నాను.

("కొత్తకథ" కథాసంకలనం - వేదగిరి కమ్యూనికేషన్స్ : నవంబరు 1993)